


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 12 ఫిబ్రవరి 2026 | 10 పేజీలు


# ముగిసిన 'పుర పోరు'...





- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు
- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం
- సల్ప ఘటనలతో ముగిసిన పోలింగ్

**సూర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన మున్సిపల్ సాధారణ ఎన్నికలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. కొన్ని వార్డుల్లో చిరు చేదురు సంఘటనలు మినహాయిస్తే, మొత్తం పోలింగ్ ప్రక్రియ ఎటువంటి అంతరాయాలు లేకుండా సాగింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగగా, చివరి నిమిషం వరకు ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో మేయర్, చైర్మన్ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, ఇతర ప్రముఖులు తమ తమ వార్డుల్లో ఓటు వేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సిబ్బంది అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీలు వేసి, కట్టుదిట్టమైన భద్రత మధ్య వాటిని ప్రత్యేక బస్సుల ద్వారా కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ఎన్నికల ప్రక్రియను పోలీసులు పర్యవేక్షిస్తూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ నెల 13న ఓట్ల లెక్కింపు జరగనుండగా, పోటీలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం ప్రస్తుతం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. ఫలితాలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

(వివరాలు లోపలి పేజీల్లో)

















## కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల

# పోలింగ్ ప్రశాంతం

- సజావుగా మున్సిపల్ ఎన్నికలు
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- పోలింగ్ కేంద్రాల సందర్శన
- ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్
- వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ పర్యవేక్షణ
- కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026లో భాగంగా కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, హుజూరాబాద్, జమ్మి కుంట, చొప్పదండి, మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి (మిగతా 2లో)



## మున్సిపల్ సాధారణ ఎన్నికలు- 2026

### - ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ కార్పొరేషన్‌లో 62.98% ఓటింగ్ నమోదు మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 477 పోలింగ్ కేంద్రాల్లో 62.98 శాతం పోలింగ్ నమోదైంది. 66 డివిజన్లలో ఉన్న 3,40,580 మంది ఓటర్లలో 2,14,486 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. వీరిలో 1,08,888 మంది మహిళలు, 1,05,579 మంది పురుషులు ఉన్నారు.

**జమ్మికుంట** మున్సిపాలిటీలో 30 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 79.81 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 34,455 మంది ఓటర్లలో 27,498 మంది ఓటు వేశారు.

**హుజూరాబాద్** మున్సిపాలిటీలో 30 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 81.47 శాతం పోలింగ్ నమోదైంది. 29,531 మంది ఓటర్లలో 24,060 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**చొప్పదండి** మున్సిపాలిటీలో 14 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 78.76 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 13,916 మంది ఓటర్లలో 10,960 మంది ఓటు వేశారు.

మొత్తంగా అన్ని మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

**(మొదటి పేజీ తరువాయి)**

పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎన్నికల సరళని పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ నుండి ఎన్నికల తీరును పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌంటింగ్ ప్రక్రియ కోసం ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించారు.కరీంనగర్ లోని రోడ్లు భవనాల శాఖ ఎస్ ఈ కార్యాలయం, జ్యోతినగర్ లోని ఎస్సార్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ సందర్శించారు. సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్ ను పరిశీలించారు. ఈ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన వారికి మొక్కలు అందజేశారు.పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఓటర్ల సంఖ్య, అప్పటి వరకు నమోదైన పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలని, ఆన్లైన్లో నివేదికలు సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. సాయంత్రం 5 గంటల్లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.

**- ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్**

రోడ్లు భవనాల శాఖ ఎస్ ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ లొకేషన్ లో ఉన్న పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

**- వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళి పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీలకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ స్క్రీన్ ల ద్వారా జిల్లా ఎన్నికల అధికారి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.కరీంనగర్ మున్సిపల్



కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ద్వారా అక్కడి పరిస్థితిని సమీక్షించారు.

**- కౌంటింగ్ కేంద్రం పరిశీలన**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగియడంతో ఈనెల 13న జరిగే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి పరిశీలించారు. ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ హాల్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఓట్ల లెక్కింపు వివరాలను నిర్దిష్ట ఫార్మాట్లో నమోదు చేయాలని అన్నారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రమే కారణం

**- బండి సంజయ్.. రైతులకు యూరియా అందించాల్సిన బాధ్యత నీకు లేదా**

**- రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే వాటా గురించి మాట్లాడవా**

**- ప్రజాస్వామ్యం గురించి గంగుల కమలాకర్ మాట్లాడటం సిగ్గుచేటు**

**- గంగుల కమలాకర్, బండి సంజయ్ పై సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**

**సూర్య కరీంనగర్**

రాష్ట్రంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని, యూరియా ఇవ్వకుండా మోసం చేస్తోందని బండి సంజయ్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన యూరియా వాటాను సకాలంలో అందించకుండా బిజెపి సర్కార్ మోసం చేసిందని మండిపడ్డారు.. కేంద్రం వాటా నిలిపేసి బదనాం మాత్రం రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కు రైతులు ఓట్లు వేయలేదా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు.



యూరియా పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాష్ట్రానికి వచ్చే వాటా విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సుడా చైర్మన్ కోరారు..రైతాంగం దగ్గర రాష్ట్ర ప్రభుత్వాన్ని కావాలనే బదనాం చేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ఇదే సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, ఓటుకు పదివేల రూపాయలు ఇచ్చి కొంటున్నారని గంగుల కమలాకర్ చేసిన ఆరోపణ పైన కూడా సుడా చైర్మన్ స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది టిఆర్ఎస్ ప్రభుత్వమే అని, విచ్చలవిడిగా టిఆర్ఎస్ హయాంలోనే డబ్బుల పంపిణీ జరిగిందని సుడా చైర్మన్ ఆరోపించారు. ఓటర్లను గంగుల కమలాకర్ అవమానిస్తున్నారని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని బిఆర్ఎస్ కు కాంగ్రెస్ కు మధ్య పాలనను ప్రజలు తెలుసుకున్నారని సుడా చైర్మన్ అన్నారు.

# ప్రశాంతంగా పోలింగ్..

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్..**



**సూర్య మెట్‌పల్లి:-**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. బుధవారం మెట్‌పల్లి మున్సిపల్ లో పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాటు చేసిన సదుపాయాలు, పోలింగ్ సామగ్రి వినియోగం,బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల పనితీరును సమీక్షించారు. పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తీరు గురించి వివరాలు తెలుసుకుని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సక్రమంగా నిర్వహించాలని, వృద్ధులు,దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించి, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.ఓటర్ల గుర్తింపు ధృవీకరణ ప్రక్రియ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లపై కూడా ఆరా తీశారు. ఏవైనా సమస్యలు తలెత్తిన పక్షంలో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్లు,మున్సిపల్ కమిషనర్ లు,తహసీల్దార్ లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగిస్తుంది

**- వెలిచాల రాజేందర్ రావు**

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృష్టించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. మేయర్ పదవిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిఫ్ట్‌గా అందిస్తామని తెలిపారు.బుధవారం క్రిస్టియన్ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించిన ఆయన, కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ ప్రభంజనం వీచిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచారని, అత్యధిక సీట్లు గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే గెలుపుకు బాటలు వేశాయని పేర్కొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు టి.జె.ఎస్. మద్దతు

**సూర్య హుజురాబాద్**



కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాల పోరాటాల ద్వారా కార్మికుల సంక్షేమం కోసం సాధించుకున్న చట్టాలను బలహీనపరుస్తూ, కార్మికుల హక్కులు, ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా లేబర్ కోడ్‌లు తీసుకువచ్చారని ఆయన అన్నారు.కేవలం కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చే విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్ పోరాటంలో ప్రజాస్వామిక వాదులందరూ పాల్గొనాలని కోరారు.. దేశంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కీలక రంగాల్లో కార్పొరేట్ ఆధిపత్యాన్ని పెంచే విధానాలకు వ్యతిరేకంగాటి జె ఎస్. అనుబంధ సంఘాలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.

## కబ్జా కోరల్లో వైకుంఠధామం..?

**సూర్య ఎండపల్లి**



ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామ వైకుంఠధామం కబ్జా కోరల్లో చిక్కుకుందని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో గ్రామంలో నిర్మించిన వైకుంఠధామ స్నాన ఘట్టాలు స్త్రీ,పురుషులకు వేరు వేరుగా నిర్మించడం స్త్రీస్నాన ఘట్టాలకు ప్రత్యేకించి గోడ నిర్మాణం చేయించారు. ప్రస్తుతం ఆ గోడ కూలిపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి వెంబడి స్నాన ఘట్టాలకు వెళ్లే మార్గం కూడా బండరాళ్లతో దర్శనమివ్వడం వైకుంఠధామ స్నాన ఘాట్ లను అనుకొని పత్తి పంట వేయడం కూడా వైకుంఠధామం ఆక్రమణకు గురవుతుందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి ఇప్పటికైనా పంచాయతీ పాలక వర్గం అధికారులు వైకుంఠధామ స్థలాన్ని కాపాడాలని, స్నాన ఘట్టాలను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటాం**

**- గ్రామ కార్యదర్శి తిరుపతి రెడ్డి**

వైకుంఠధామం స్థలంకబ్జా అయిందని తమ దృష్టికి రాలేదని,క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తామని, విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాం.

## రెండు మున్సిపాలిటీల పై జెండా ఎగరవేస్తాం..

**- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.**

**సూర్య మెట్‌పల్లి:-**



కోరుట్ల, మెట్‌పల్లి రెండు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని. రెండు మున్సిపల్ లలో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులే చైర్మన్ గా కొనసాగనున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే సంజయ్ దంపతులు ఓటు హక్కు వినియోగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. తాము చేసిన అభివృద్ధి పనులు తమ పార్టీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ప్రజలకు చేసింది ఏమి లేదని ప్రజలు కాంగ్రెస్ అసమర్థ పాలనను గమనించి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కు పట్టం కడతారని తెలిపారు. ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు విలువైనదని ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

# విచ్చలవిడిగా ఇసుక రవాణా.!

**- ఒక కూపన్తో పదుల సంఖ్యలో రవాణా - రూట్ మ్యాప్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అతివేగంగా ప్రయాణం...**

**- భయాందోళనలో ప్రజలు... - అధికారుల కనుసందుల్లో జరుగుతుందంటున్న స్థానికులు...**

**- సమయపాలన పాటించని వాహనాల యాజమానులు...**

**సూర్యముస్తాబాద్**

మండలంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది.అడ్డుకునే అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం మూలంగా అక్రమార్కులకు కాసుల పంట పండడంతో పాటు ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.నిబంధనలను తుంగలో తొక్కి,అధికారుల కళ్లు గప్పి ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

**- అక్రమ ఇసుక రవాణా - నిబంధనల ఉల్లంఘన...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేసే వాహనాలకు రిజిస్ట్రేషన్ ప్లేట్లు ఉండాలి, నిర్దేశిత మార్గాల్లో మాత్రమే ప్రయాణించాలి, చెల్లుబాటు అయ్యే పర్మిట్లు (కూపన్లు) కలిగి ఉండాలి. అయితే, క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు పాటించబడుతున్న దాఖలాలు తక్కువగా ఉన్నాయని సమాచారం.నెంబర్ ప్లేట్లు లేని వాహనాల్లో ఇసుక రవాణా జరుగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.



**- ప్రమాదకర ప్రయాణం?**

ఒక కూపన్పై మూడు ట్రిప్పుల పరిధి ఉండగా మూడు ట్రిప్పులకు పైబడి ఇసుక రవాణా జరుగుతుందని,కొంతమంది ఇసుక టోకెన్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రధాన రహదారులతో పాటు నివాస ప్రాంతాల్లో ఇసుక వాహనాలను అధిక వేగంతో ప్రయాణిస్తున్నారాని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.వేగంగా వెళ్తున్న వాహనాల నుండి ఇసుక పడి చిన్నపాటి ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాల పెద్దపెద్ద శబ్దాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు తెలియజేస్తున్నారు.

**- అధికారుల స్పందన ఆవశ్యకం...**



ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిని ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని కొందరు విమర్శిస్తున్నారు. లైసెన్స్ లేని,నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్

**- సిరిసిల్లలో 77.56 శాతం నమోదు - ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువత**

**- ప్రలోభాల పర్వం, జోరుగా మద్యం, నగదు పంపిణీ**

**- పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేష్ బి గీతే**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రమైన సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. స్వల్ప సంఘటనలు మినహా ఓటింగ్ ప్రక్రియ సాఫీగా సాగింది. జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేయడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిరిసిల్ల పట్టణంలో 77.56 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.33709 మంది మహిళలు,30482 మంది పురుషులు, 5 మంది ఇతరులతో సహా 63566 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**- పోటెత్తిన ఓటర్లు.. యువత, మహిళల సందడి**

ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా, తొలి గంటల్లో ఓటింగ్ మందకొడిగా సాగింది. అయితే మధ్యాహ్నం తర్వాత ఓటర్లు భారీగా తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు, యువత క్యూ లైన్లలో ఉత్సాహంగా కనిపించారు. హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుండి సైతం ఓటర్లు తమ సొంత గడ్డపై ఓటు వేసేందుకు తరలిరావడం విశేషం. మొత్తం 39 వార్డుల్లోని 117 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బంది కలగకుండా వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. ప్రతి కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు.




**- క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ**

పోలింగ్ సరళిని జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమా అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తును సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్లోని ఐడీఓసీ భవనంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ సెంటర్ను కలెక్టర్ సందర్శించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను లైవ్ స్క్రీన్ల ద్వారా నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఈడీఎం శ్రీనివాస్, పర్యవేక్షకులు ప్రవీణ్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

**- ప్రలోభాల ప్రవాహం... భారీగా నగదు స్వాధీనం**

ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంలో వెనకాడలేదు. ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. మున్సిపల్ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మద్యం, డబ్బు పంపిణీ జోరుగా సాగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొన్ని వార్డుల్లోనైతే ఏకంగా ఓటుకు ఏడు వేల వరకు పంపిణీ చేశారన్నది సమాచారం. అయితే పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించి, సోదా ల్లో పెద్ద ఎత్తున నగదును, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుంది.

**- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం**

మొత్తం 170 మంది అభ్యర్థుల భవితవ్యం ప్రస్తుతం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్లో ఉన్న వారందరికీ రాత్రి వరకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఎస్పీ మహేష్ బి గీతే ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ ముగియడంతో అభ్యర్థులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటింగ్ పూర్తి కావడంతో అభ్యర్థుల భవితవ్యం ఈ నెల 13న కౌంటింగ్ లో తేలనుంది.









## హరిత సేనలో మొక్క నాటిన చిన్నారి సమీక్ష

**సూర్య బోయినపల్లి**



మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో బోయినపల్లి మండలం తడగొండలో సవనపెల్లి మహేష్ మనీషా చిన్న కుమార్తె సమీక్ష, జన్మదినం పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి వారి ఇంటి ఆవరణలో మొక్క నాటిన సమీక్ష. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాకు మొక్కలు నాటడం చాలా ఇష్టమని నా పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటడం సంతోషంగా ఉందని తెలిపారు. మాజీ సర్పంచ్ చిందం రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్లో పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాహ్నవి,లత, అర్చన, చిన్నారులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు ప్రారంభం

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలంలోని ధర్మారం టు అగ్రహారం రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్వై నుండి నిధులు మంజూరు కాగా బుధవారం నాగారం రామన్నపేట సర్పంచులు రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా ధర్మారం నుండి నాగారం, రామన్నపేట, చంద్రగిరిగ్రామాల నుండి అగ్రహారం వరకు గతంలో నిధులు మంజూరు కాగా నిధులు సరిపోక రామన్నపేట వరకు మాత్రమే తారు రోడ్డు వేశారు.మిగిలిపోయిన రోడ్డు నిర్మాణానికి మళ్లీ రూ.2.66 కోట్లు మంజూరు కాగా కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని నాగారం సర్పంచ్ అప్పల నాగభూషణం కోరారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ కంది లక్ష్మి, నాగారం ఉపసర్పంచ్ కీర్తన, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని చితకబాదిన అంగన్వాడీ టీచర్

**సూర్య, ఎల్లారెడ్డిపేట**



అభం శుభం తెలియని ఓ చిన్నారిని అంగన్వాడీ టీచర్ దారుణంగా కొట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటాపూర్కు చెందిన కొమ్మేపల్లి లక్ష్మి విజయ్ కుమార్ దంపతుల కుమారుడు కొంపెల్లి విధ్వాన్ష్(3)ను స్థానిక అంగన్వాడీ కేంద్రానికి పంపిస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం తన కొడుకుని అంగన్వాడీ కేంద్రానికి పంపారు. అయితే టీచర్ సల్వాని రాణి అకారణంగా బాలుడిని కొట్టడంతో కంటికి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి అని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కె. రాహుల్ రెడ్డి తెలిపారు.

## హార్వెస్టర్ టైర్ల చోరీ

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం శివంగలపల్లి గ్రామంలో గుర్తు తెలియని దుండగులు హార్వెస్టర్ టైర్లను దొంగలించారు.గ్రామానికి చెందిన పుట్ట రోహిత్ అనే రైతు తన హార్వెస్టర్ గ్రామంలోని రోడ్డు పక్కన ఉంచాడు.మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు రెండు టైర్లను ఎత్తుకెళ్లారు.దీనిపై పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసినట్లు బాధిత రైతు వాపోయాడు.

# జిల్లాలో 5 మున్సిపాలిటీలలో ప్రశాంతంగా పోలింగ్

## - జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జిల్లా పరిధిలోని 5 మున్సిపాలిటీలలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సందర్శించి ఏర్పాటు చేసిన సదుపాయాలు, పోలింగ్ సామగ్రి వినియోగం, బ్యాలెట్ యూనిట్లు కంట్రోల్ యూనిట్ల పనితీరును సమీక్షించారు. పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తీరు గురించి వివరాలు తెలుసుకుని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సక్రమంగా నిర్వహించాలని, వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించి, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ల గుర్తింపు ధృవీకరణ ప్రక్రియ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లపై కూడా ఆరా తీశారు. ఏవైనా సమస్యలు తలెత్తిన పక్షంలో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా లోని 5 మున్సిపాలిటీలలో పోలింగ్ సజావుగా కొనసాగుతోందని తెలిపారు.ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

## - పోలింగ్ బూతులు పెంచడంతో ప్రశాంతంగా ఓటింగ్



**సూర్య,రాయికల్**

రాయికల్ పట్టణంలో 12 వార్డులకు జరిగిన మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి గౌతమ్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాయికల్ పట్టణంలో 12 వార్డులకు గాను జరిగిన మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. వివిధ పార్టీల నుండి 100 మంది అభ్యర్థులు పోటీలో నిలువగా ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి భారీగా తరలివచ్చారు.అధికారులు ముందస్తు జాగ్రత్తగా పోలింగ్ కేంద్రాలను ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాయికల్ పట్టణంలో మొత్తం 13084 మంది ఓటర్లు ఉండగా,దీనిలో 9808 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.దీనిలో ఎక్కువగా 5558 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 4250 మంది పురుషులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మొత్తం 74.96 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి గౌతమ్ రెడ్డి తెలిపారు. కాగా ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి శ్రీనివాస్ పోలింగ్ సరళిని పరిశీలించారు. యువతి, యువకులు ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. అలాగే వివిధ ప్రాంతాలలో చదువుతున్న, ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన యువకులు తమ ఓటు హక్కును వినియోగిం చుకోవడానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎక్కువ మంది వృద్ధులను సైతం అభ్యర్థులు వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించి ఓటు వేసే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల రక్షణ చర్యలు, పోలింగ్ సరళిని జగి త్యాల ఎస్.బి.డీస్పీ వెంకటరమణ పరిశీలించారు. అలాగే ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో రాయికల్ ఎస్సై సుధీర్ రావు, సారంగాపూర్ ఎస్సై గీత, బీర్పూర్ ఎస్సై రాజు తమ సిబ్బందితో రక్షణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు ఎంపీడీవో చిరంజీవి తహ సిల్దార్ నాగార్జున రెవెన్యూ, పోలీస్, మున్సి పల్, అంగని వాడి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.







# అంబులెన్స్‌లో వచ్చి... ఓటు వినియోగించుకొని...

## - అనారోగ్య పరిస్థితుల్లో ఓటు ప్రాముఖ్యతను చాటిన వృద్ధురాలు

**సూర్య మెట్‌పల్లి**

ఓటు హక్కు ఎంత విలువైందో ప్రజలు తెలుసుకునేలా చేసింది ఓ కుటుంబం. లేవలేని స్థితిలో ఉన్న ఆ వృద్ధురాలిని అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చి ఓటు వేయించి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచింది. మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు వెంకట్రావు పేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈ సన్నివేశం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే మున్సిపల్ ఎన్నికలు జరుతున్న తరుణంలో వెంకట్రావుపేట 11 వ వార్డుకు చెందిన ఆడెపు సరస్వతి వయస్సు (88) అనారోగ్యంతో బాధపడుతుంది. లేచి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు తన ఓటును వినియోగించుకోవాలని కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే కుటుంబ సభ్యులు మనవరాలు,కుమారుడు అంబులెన్స్ ద్వారా పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకువచ్చి, సిబ్బంది సహకారంతో పోలింగ్ కేంద్రం లోకి తీసుకెళ్లి ఓటు వేయించారు. అనారోగ్య పరిస్థితుల్లోనూ ప్రజాస్వామ్య పట్ల తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన ఈ ఘటన అక్కడ ఉన్నవారిని



ఆకట్టుకుంది.ఓటు హక్కు విలువను చాటిచెప్పిన ఈ సంఘటన అక్కడున్న సిబ్బంది, ప్రజల్లో చైతన్యం నింపింది.

# తాత నీకు తోడుగా నేనున్న...

## - పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు వృద్ధునికి ఎమ్మెల్యే చేయుత

**సూర్య మెట్‌పల్లి**



తాత నీకు తోడుగా నేనున్న పద అని చేయి పట్టి నడుస్తూ ఓ వృద్ధునికి ఎమ్మెల్యే తోడుగా నిలిచాడు. పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఈ సంఘటన అక్కడ ఉన్న అందరినీ ఆకట్టుకుంది. వివరాల్లోకి వెళితే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దంపతులు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాగా అక్కడ వృద్ధ దంపతులు ఓటు వేసేందుకు వేచి ఉన్నారు. వృద్ధుడికి నడిచేందుకు ఇబ్బంది ఏర్పడడంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే సంజయ్ వృద్ధుడి చేతు పట్టుకొని పోలింగ్ కేంద్రం వరకు తీసుకువెళ్లి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ దృశ్యం అక్కడ ఉన్న అందరిని ఆకట్టుకుంది.

# వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిశీలన

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



పోలింగ్ జరుగుతున్న తీరును ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. బుధవారం జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. వివిధ మున్సిపాలిటీలలోని పోలింగ్ కేంద్రల్లో పోలింగ్ కేంద్రం లోపల ఓటింగ్ సరళి, పోలింగ్ కేంద్ర బయట ఓటర్ల రద్దీ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.అలాగే పోలింగ్ జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. రిపోర్ట్‌లను సూచించిన సమయం ప్రకారం ప్రతి రెండు గంటలకు ఒకసారి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా నోడల్ అధికారులు కె.రాజ్ కుమార్, పి.నరేష్, కలెక్టరేట్ ఏవో హకిమ్, ఈ డి ఎం మమత, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్‌కు కొడిమ్యాల విద్యార్థుల ఎంపిక

## - ఎస్‌జీఎఫ్ అండర్-17కు శ్రీహర్ష ఎంపిక కాలేజీకి గర్వకారణం
## - ప్రిన్సిపాల్ కే. వేణు

**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్-17 క్రికెట్ జట్టుకు కాలేజీ విద్యార్థి కోలా శ్రీహర్ష ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కే వేణు తెలిపారు.మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 13న నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ మ్యాచ్‌లకు శ్రీహర్ష ఎంపిక కావడం కాలేజీకి గర్వకారణమని తెలిపారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయికి ఎదగడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, కాలేజీకి చెందిన మరో విద్యార్థి ఎర్రోజి తక్షిల్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-19 టోర్నమెంట్‌లో ప్రస్తుతం పాల్గొంటున్నాడు. ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం కళాశాలకు మరింత ప్రతిష్ట తీసుకువచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ ఇన్‌చార్జి బి. భాస్కర్, క్లాస్ టీచర్ జయపాల్ రెడ్డి, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందనలు తెలిపారు.





నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



# ప్రశాంతంగా ముగిసిన పుర"పోరు"

**- అభ్యర్థుల భవితవ్యం ఈవీయంలో భద్రం - జిల్లా వ్యాప్తంగా ఉత్సాహభరిత పోలింగ్ - 13న కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి**









**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

జిల్లాలోని రామగుండం కార్పొరేషన్ తో పాటు పెద్దపల్లి,మంథని,సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో జరిగిన పురపాలక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది.పెద్దపల్లి లో 73,రామగుండం 277,సుల్తానాబాద్ 30,మంథని 26 పోలింగ్ కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో 43789 ఓట్లు ఉండగా 32201 ఓట్లు పోలయ్యాయి (73.54) మంథని మున్సిపాలిటీ లో 14402 ఓట్లు ఉండగా 11056 ఓట్లు పోలయ్యాయి (76.76) రామగుండం కార్పొరేషన్ లో 179624 ఓట్లకు గాను 124520 ఓట్లు పోలయ్యాయి (69.32), సుల్తానాబాద్ మున్సిపాలిటీ లో 16824 ఓట్లు ఉండగా 13716 పోలయ్యాయి(81.53). జిల్లా వ్యాప్తంగా మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ర్యాంపులు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. కొన్నిచోట్ల ఉదయం నుంచి క్యూ లైన్లు కనిపించాయి. మొదటివేళల్లో నెమ్మదిగా సాగిన పోలింగ్, మధ్యాహ్నం తరువాత ఊపందుకుంది. ఓటర్లు ఉదయం నుండే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో భద్రపరచబడింది.ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించారు. సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేపట్టారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా అధికారులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. చిన్నచిన్న వివాదాలు తలెత్తిన వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిష్కరించారు.

**ప్రధాన పార్టీల ధీమా..**

పురపోరులో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఈసారి ఎన్నికలు కేవలం స్థానిక ప్రతినిధుల ఎంపికకు పరిమితం కాకుండా, నగర అభివృద్ధి దిశను నిర్ణయించే కీలక సమరంగా మారాయి. ప్రచారం ప్రారంభం నుంచే ప్రధాన పార్టీలన్నీ వ్యూహాత్మకంగా ముందుకెళ్లి, ఇంటింటికీ చేరుకునే ప్రయత్నం చేశాయి. చివరి రోజు వరకు ఉత్కంఠభరిత వాతావరణం కొనసాగింది.ప్రచారంలో యువత, మహిళలు కీలక పాత్ర పోషించాయి. సోషల్ మీడియా వేదికలపై ప్రచారం, ప్రత్యక్ష సమావేశాలు, రోడ్ షోలు అన్నీ కలిసి పోటీని మరింత ఉత్కంఠభరితంగా మార్చాయి. ప్రతి పార్టీ గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తుండగా, అసలు తీర్పు మాత్రం ఓటర్ల చేతుల్లోనే ఉంది.ఈసారి పురపోరు కేవలం రాజకీయ ప్రతిష్ఠకే పరిమితం కాకుండా, నగర భవిష్యత్తు అభివృద్ధి, పాలనలో పారదర్శకత, ప్రజలకు అందే సేవల నాణ్యత వంటి కీలక అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణగా మారింది. ఫలితాలు ఎలా వచ్చినా, ప్రజల ఆశలు నెరవేర్చడం కొత్త పాలకుల ముందున్న అతిపెద్ద సవాలుగా నిలవనుంది.

**ఈవీఎంల భద్రపరిచి ంపు**

పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో సీల్ చేసి భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద 24 గంటల భద్రత ఏర్పాటు చేశారు. సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో, పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ వాహనాల ద్వారా స్ట్రాంగ్‌రూమ్‌లకు తీసుకెళ్లారు. ప్రతి వాహనానికి ప్రత్యేక భద్రతా బలగాలు ఎస్కార్ట్‌గా వెళ్లాయి. మార్గమధ్యంలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక రూట్ మ్యాప్ ప్రకారం తరలింపు చేపట్టారు.స్ట్రాంగ్‌రూమ్‌ల వద్దకు చేరుకున్న తర్వాత అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను మళ్లీ పరిశీలించి, గదుల్లో అమర్చారు. అనంతరం గదులను సీల్ చేసి, సీలింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించామని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

**13న కౌంటింగ్**

ఈ నెల 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రౌండ్‌వారీగా ఫలితాలు ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆ రోజు ఫలితాలపై జిల్లావ్యాప్తంగా ఉత్కంఠ నెలకొననుంది.మొత్తం మీద ప్రశాంత వాతావరణంలో జరిగిన పురపోరు ప్రజాస్వామ్య పండుగను మరోసారి గుర్తు చేసింది. ఇప్పుడు అందరి చూపు 13న వెలువడే ఫలితాలపై నిలిచింది.







# సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

**- బ్యాలెట్ బాక్స్ లో అభ్యర్థుల భవితవ్యం - కాంగ్రెస్ పార్టీ వైపు మెజార్టీ సీట్లు ?**

**సూర్య - సుల్తానాబాద్**

సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రపరిచారు. ఈ నెల 13 న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. 15 వార్డులకు జరిగిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. 15 వార్డులకు గాను 81.52% పోలింగ్ నమోదు కాగా మొత్తం 13716 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుండే పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులు తీరారు. అధికారులు వృద్ధులను వీల్ చైర్ లో కూర్చోబెట్టి ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఎర్రోజు లావణ్య అనే మహిళా చంటి బిడ్డతో వచ్చి ఓటు వేశారు. సిఐ సుబ్బారెడ్డి, ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



## మంథని లో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**-మున్సిపాలిటీ లో 76.76 శాతం ఓట్లు పోలింగ్**

**సూర్య మంథని**



పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో 76.76 శాతం ఓట్లు పోలయ్యాయి. పురుషుల ఓట్లు 5663 పోలుకాగా మహిళలు 5393 ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓట్లు 14.402 ఓట్లు ఉండగా మొత్తం 11056 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు, 76.76 శాతం ఓట్లు పోలైనట్టు మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా గంట వరకు మందకోడిగా సాగింది. 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓటర్లు అధిక సంఖ్యలో రావడంతో కొన్ని పోలింగ్ బూతుల్లో ఓటర్లు బార్లు తీరారు. మంథని మున్సిపల్ పరిధిలోని 13 వార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడం విశేషం. విజయం పై రాజకీయ పార్టీల్లో ఎవరికివారు ధీమాగా ఉన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు దక్కించుకునే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటా పోటీగా ప్రచారం నిర్వహించాయి. 13 వార్డులకు గాను, భారతీయ జనతా పార్టీ 12 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో వారికి వచ్చే ఓట్ల ప్రభావం కొన్ని వార్డుల్లో అభ్యర్థుల గెలుపు ఓటములపై ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోపాటు టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు లు ఎన్నికల ను పర్యవేక్షించి, కాంగ్రెస్ కార్యకర్తలను నాయకులను అప్రమతం చేసి ఓటింగ్ సరలని పెంచే విధంగా వ్యూహం రచించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ స్థానాలు లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసులు అందజేశారు

**సూర్య ఎలిగేడు**



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోందని జాతీయ కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో 2026 ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు మంగళవారం వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను తక్షణమే నోటిఫికేషన్‌తో పాటు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పేదలకు ఉపాధి హామీ కల్పిస్తున్న చట్టాన్ని కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నేరేడు కొమ్మ సత్యనారాయణతో పాటు నాయకులు దేవేందర్, కౌంపల్లి నరసయ్య, చిరంజీవి, నరసయ్య, మల్లమ్మ, శేఖర్, రాజమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ లో చేరిన కాంగ్రెస్ నాయకులు బూస

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం కలవచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బూస వెంకటరమణ బుధవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సమక్షంలో భీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



# రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం

**- రేవంత్ రెడ్డి సర్కార్ కు బ్రహ్మరథం - ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు.**

**సూర్య, సెంటినరీ కాలనీ**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం ఉదయం కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రామగుండం, కరీంనగర్, కార్పొరేషన్లను పూర్తిస్థాయిలో కాంగ్రెస్ కార్పొరేటర్ గెలుపొంది ఆయా రెండు పీఠాలను హస్తగతం చేసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మంథని పెద్దపల్లి అలాగే కరీంనగర్ జిల్లాలోని మొత్తం మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది అని అన్నారు. ముఖ్యంగా



రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓటు వేశారని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతుందని పేర్కొన్నారు. అన్ని స్థానాల్లో స్థానాల్లో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని అలాగే మా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అయిందని అన్నారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. నేడు తెలంగాణలోని ప్రతి ఒక్కరి కళ్ళలో కాంగ్రెస్ పాలనలో ఆనందం వెల్లివిరుస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, పేరా పల్లి సర్పంచ్ బొంగుని సదయ్య గౌడ్, గుండారం ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు సది, గరిగంటి కృష్ణ,బొడ్డు రవి, పిడుగు కవిత, రాచకొండ రజిత, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు , ఆడువాలా చంద్రయ్య తో పాటు నాయకులు పిడుగు శంకర్, మతిన్ ఖాన్ ఇక్బాల్, లల్లు, వడ్లకొండ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం బల్దియా లో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

**- 69.32 శాతం పోలింగ్ నమోదు - 1.24 లక్షలకుపైగా ఓటర్లు ఓటు వినియోగం**

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం నగరపాలక సంస్థ లో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. నగరంలోని మొత్తం 272 పోలింగ్ స్టేషన్ లలో ఎలాంటి పెద్దగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ పూర్తయింది. మొత్తం 59 డివిజన్ల పరిధిలో ఉన్న 1,79,624 మంది ఓటర్లలో 1,24,520 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం పోలింగ్ శాతం 69.32 గా నమోదైంది. ఓటు హక్కు వినియోగించిన వారిలో 62,868 మంది మహిళా ఓటర్లు, 61,640 మంది పురుష ఓటర్లు, 12 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. ముఖ్యంగా మహిళా ఓటర్ల భాగస్వామ్యం గణనీయంగా ఉండటం విశేషం. ఎన్నికల నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం అధికారులు గోదావరిఖని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం. రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ క్యూలైన్ లో నిలబడి సామాన్య ఓటరుగా




ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**- ఎన్నికల బందోబస్తు పర్యవేక్షణ.. పోలింగ్ ప్రక్రియపై ఆరా**

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను బుధవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు ఎన్నికల తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీపీసీ లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్, మంచిర్యాల పట్టణంలోని ఆర్బీహెచ్‌వీ, క్రిస్ట్ స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, భద్రతాచర్యలు, క్యూలైన్ల నిర్వహణ, వృద్ధులు, దివ్యాంగుల కోసం కల్పించిన ప్రత్యేక సదుపాయాలను పర్యవేక్షించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, శాంతియుతంగా కొనసాగుతోందా అనే అంశంపై కమిషనర్ ప్రత్యక్షంగా ఆరా తీసి, పోలింగ్ అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అలాగే ఓటర్లతో కూడా మాట్లాడి, ఏమైనా ఇబ్బందులు ఏమైనా ఎదురైతే వెంటనే పోలీస్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని, ఓటర్లు స్వేచ్ఛ వాతావరణం లో ఓటు హక్కు వినియోగించుకోలేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఉన్నారు.

## సవాళ్ల సింగరేణి కి..."డాక్టర్ సాబ్" చికిత్స చేసేనా...!

**- కొత్త సిఅండ్ఎండి గా డా.జ్యోతి బుద్ధ ప్రకాష్**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థకు నూతన సిఅండ్ఎండి గా డా.జ్యోతి బుద్ధ ప్రకాష్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ క్యాడర్ కు చెందిన 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కర్ణాటకకు చెందిన ఈయన ఎం.బి.బి.ఎస్ విద్యను అభ్యసించారు. ఈయన తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా సహా పలు కీలక పరిపాలన పదవులను నిర్వహించారు. గత డిసెంబర్ లో సిఅండ్ఎండి గా ఉన్న బలరాం నాయక్ తన రెవెన్యూ శాఖకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఇంచార్జి గా ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ అనేక సవాళ్ళను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా సింగరేణి లో ఓబీ కాంట్రాక్టుల్లో సైట్ విజిట్ నిబంధన సంస్థ ను అతలాకుతలం చేసింది. ఇది ప్రక్క రాష్ట్రమైన ఒరిస్సా లోని నైనీ ప్రాజెక్ట్ ను కూడా తాకింది. ఇక సింగరేణి సంస్థ లో బొగ్గు నాణ్యత తగ్గిందని, కొనే గిరాకీ తగ్గడం జరిగింది. దీనికి తోడు మెడికల్ బోర్డు సజావుగా సాగకపోవడం ఒక సవాల్ గా ఉంది. ఇప్పటికే పర్మినెంట్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, వారిని పని స్థలాల్లో సర్దుబాటు చేయడానికి యాజమాన్యం నానా తంటాలు పడుతుంది. ఇక అధికారులకు పెర్ఫార్మన్స్ రిలేటెడ్ పే(పి.ఆర్.పి) ఒక సమస్యగా మారింది. వీటన్నింటికి నూతనంగా వస్తున్న “డాక్టర్ సాబ్ “ చికిత్స చేసేనా అని చర్చ మొదలైంది.



# మహాశివరాత్రి ఉత్సవానికి సర్పంచ్ కి ఆహ్వానం

**సూర్య, సెంటినరీ కాలనీ**

ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి జాగరణ ఉత్సవం ఈ సంవత్సరం కూడా నిర్వహించడానికి, అలాగే ముఖ్య అతిథులను ఆహ్వానించడానికి ఆహ్వాన పత్రిక ను కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ చేతుల మీదుగా చత్రపతి శివాజీ యువసేన సభ్యులు ఆవిష్కరించారు. మొదటి ఆహ్వానాన్ని ను సర్పంచ్ కి అందజేశారు. ఈ సందర్భంగా యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు, వివిధ కళాకారులు, దేశభక్తి దేవా భక్తి నృత్య ప్రదర్శనలు ఇతర కార్యక్రమాలు కూడా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకుడు జంగపల్లి శ్రీనివాస్, కమాన్ పూర్ ఉప సర్పంచ్ రఫీక్, సిద్దిపల్లె ఉప సర్పంచ్ కొత్తపల్లి సతీష్, వార్డు సభ్యులు మెరుగు కుమార్, లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, మురళి మనోహర్ రావు, బీజేపీ నాయకులు జంగ పెల్లి అజయ్, యువసేన నాయకులు జంగపెల్లి సతీష్, కొమ్ము శ్రీనివాస్, మొర ప్రశాంత్, జంగపెల్లి చిన్న శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటుదారులపై మంత్రి శ్రీధర్ బాబుకు ఫిర్యాదు

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో తమను వెన్నుపోటు పొడిచారని గుండారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పిడుగు శంకర్ బుధవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటూ నే మరొక పార్టీకి మద్దతు పలికి పరోక్షంగా తమ ఓటమికి నాయకులు కారకులయ్యారని మంత్రి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ వెన్నుపోటు దారులతోనే తాను ఓడిపోయానని, అటువంటి వారిని కాంగ్రెస్ పార్టీలో ఉంచకూడదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మీరు గ్రామాల్లోకి వచ్చినప్పుడు ముందు వరుసలో ఉంటారు, ఎన్నికల సమయంలో వెన్నుపోటు పొడవడం ఖాయంగా మారిందని మంత్రి శ్రీధర్ బాబుకు తెలపడంతో వారిపై తాను చర్యలు తీసుకుంటానని, దీనిపై విచారణ జరుపుతామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వారికి తెలియజేశారు.

# ఘనంగా మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ జన్మదిన వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం కలవచర్ల గ్రామ బస్టాండ్ ఆవరణలో మంథని మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ జన్మదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఒకరికి ఒకరు స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు జపతి శేఖర్,వార్డు సభ్యులు రెండ్ల కుమార స్వామి, సీనియర్ నాయకులు సైండ్ల సత్య నారాయణ, మెట్టు కిష్టయ్య, బొంకురి పోచం, మల్యాల మోహన్, ఇరుగురాళ్ల సంతోష్, బిరుదు లక్ష్మయ్య, బూస కనకయ్య, నాగుల కృష్ణ, మల్యాల పరశురాం, ఆసం ప్రభాకర్, మల్యాల సురేష్, బొమ్మనవేణి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

## - హుజురాబాద్‌లో 81.47 శాతం పోలింగ్

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ మున్సిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయి. హుజురాబాద్ మునిసిపాలిటీలో 30 వార్డులు ఉండగా, పట్టణంలో 60 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వీటి నిర్వహణ కోసం 700 మంది సిబ్బందిని కేటాయించారు. పోలింగ్ ప్రశాంతత జరగడం కోసం హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి ఆధ్వర్యంలో పలువురు సిఐలు ఎస్ఐలు పోలీసులు భద్రతా దళాలు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగాయి. హుజురాబాద్ పట్టణంలో బాలికల పాఠశాలలో పోలింగ్ ప్రారంభంలో ఓటర్లకు సందేహాలను పూర్తిచేసే హెల్ప్ డెస్క్ సిబ్బంది లేకపోవడంతో తమ ఓటు ఎక్కడుందో తెలుసుకోవడానికి ఓటర్లు నేరుగా పోలింగ్ కేంద్రానికి రావడంతో పోలింగ్ అధికారులకు ఓటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలింగ్ ప్రారంభమైన బిఎల్వోలు గాని ఆర్వోలు గాని తమ సందేహాలు నివృత్తి చేయడానికి ఎందుకు సిద్ధంగా ఉండరని పలువురు ప్రిసైడింగ్ ఆఫీసర్‌తో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ఏర్పాట్లు సక్రమంగా ఎందుకు చేయలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత కొద్ది సేపటికి బిఎల్వోలు రావడంతో సమస్య ముగిసింది. మాంటిస్సోరి స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఒక అభ్యర్థితో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని పలువురు వారితో వాగ్వాదానికి దిగారు. తర్వాత సద్దుమణిగింది. హుజురాబాద్ పట్టణంలోని 60 పోలింగ్ కేంద్రాల్లో ముఖ్యమైన పలు పోలింగ్ కేంద్రాలను ఏసిపి వాసంశెట్టి మాధవి సందర్శించి అక్కడున్న పోలీసులకు ఇతర సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల సంఘ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించరాదని అన్నారు.



**- అమ్మతనం చూపిన ఏసిపి మాధవి**

మున్సిపల్ ఎన్నికల్లో కాకతీయ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి పసిపాపతో వచ్చిన బాలింత తన పాపను ఎవరికి ఇవ్వాలో తెలియక ఇటు అటు చూస్తుండగా అక్కడే ఉన్న హుజురాబాద్ ఏసిపి మాధవి నేను పాపను చూసుకుంటాను నువ్వు వెళ్లి ఓటు వేసి రా అని చెప్పి రెండు నెలల పసి పాపను ఎత్తుకొని ముద్దాడింది. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు ఆమెలోని అమ్మతనాన్ని ప్రశంసించారు.

**- విరివిగా వృద్ధుల ఓట్లు**

హుజురాబాద్ పట్టణంలోని నాలుగో వార్డులో 97 సంవత్సరాల రామరాజమ్మ అనే వృద్ధురాలు, 17వ వార్డులో 95 సంవత్సరాల గంగాడి లింగారెడ్డి, 41వ బూతులో 80 సంవత్సరాల వయసు గల అయిత యశోద లు కుటుంబ సభ్యుల సహాయంతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**- మందకోడిగా మొదలై ప్రశాంతంగా...**

హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికలు బుధవారం ఏడు గంటలకు ప్రారంభం కాగా తొమ్మిది గంటల వరకు కేవలం 11.70 శాతం మాత్రమే పోలింగ్ నమోదయింది. మందకోడిగా మొదలైన పోలింగ్ 11 గంటల వరకు 30.40 శాతం నమోదు కాగా మధ్యాహ్నం ఒంటిగంటకు 52.90 శాతం నమోదు అయింది. మూడు గంటలకు 69.90 శాతం పోలింగ్ నమోదయింది. ఐదు గంటలకు పోలింగ్ శాతం..81.47 శాతం. నమోదు అయ్యింది. హుజురాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 29531 ఓట్లు ఉండగా అందులో పురుషులు 14357, మహిళలు 15170 మంది ఉన్నారు. కాగా వీరిలో ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 11,648 మంది, మహిళలు 12,409 మంది, మొత్తం ఓటు హక్కు వినియోగించుకున్న వారు 24,060 ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండి సాయంత్రం వరకు బారులు తీరిన ఓటర్లు ఎక్కడా లేకపోవడం గమనార్హం. ఉదయం పోలింగ్ మందకోడిగా ఉండడంతో అభ్యర్థులు పోలింగ్ ఎలా ఉంటుందోనని కొంత ఆందోళన చెందారు. పోలింగ్ రాని ఓటర్లకు ఫోన్ చేయడం, ఇతర మార్గాల ద్వారా వారిని పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చేయడం చేశారు.









## మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ తోడ్పాటు

**- 45 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేత**

**సూర్య కరీంనగర్**



మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ఎంతో ఉపయోగకరమని హైదరాబాద్ బైరాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. హన్మకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో బైరాడ్ సహకారంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 37 రోజులపాటు 45 మంది మహిళలకు శిక్షణ అందించారు. శిక్షణ ముగింపు సందర్భంగా జనవికాస సీఈవో పెండ్లి సంపత్ కుమార్‌తో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ ధృవపత్రాల ఆధారంగా ముద్ర, పీఎంఈజీపీ లోన్లు పొందే అవకాశం ఉందన్నారు. మహిళలు టైలరింగ్ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్ నిర్మలతో పాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో మానవత్వం చాటుకున్న పోలీసులు

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా, ఆరేపల్లి ఒకటవ డివిజన్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు తమ ఉదారతను చాటుకున్నారు.ఓటు వేయడానికి వచ్చిన ఒక వికలాంగుడైన వృద్ధుడు నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, వెంటనే స్పందించి వీల్ చైర్ ఏర్పాటు చేశారు. స్వయంగా ఆ వృద్ధుడిని వీల్ చైర్ సహాయంతో పోలింగ్ స్టేషన్ లోనికి పంపించి, ఆయన తన ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఓటరుకు సులభంగా ఓటు వేసే అవకాశం కల్పించడం తమ బాధ్యతని, ముఖ్యంగా దివ్యాంగులు,వృద్ధులకు అవసరమైన సహాయం అందించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

## ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్న యువ ఓటర్లు


**సూర్య జమ్మికుంట**



జమ్మికుంట మున్సిపాలిటీకి బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది పట్టణంలోని పలు బూతుల వద్ద కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్ల జోరు కనబడింది మొట్టమొదటిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో వారిలో ఎనలేని సంతోషం కనిపించింది ఇన్ని రోజులు ఎన్నికలు ఓట్ల గురించి విన్నామని మొదటిసారి తాము ఓటు వేయడం మరిచిపోని అనుభూతిగా మిగులుతుందని అని పలువురు యువ ఓటర్లు తెలియజేశారు.

## ఈ నెల 18న అపర భద్రాద్రిలో టెండర్ బహిరంగ వేలం

**సూర్య, ఇల్లందకుంట**



శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానము

గ్రా॥మం॥ ఇల్లందకుంట, జి॥కరీంనగర్.

సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలము ప్రకటన-01

ఆర్.సి.నెం.01/2026

తేది.07.02.2026

| క్ర.సం. | వేలము వివరములు | షెడ్యూల్ ధర | కాలపరిమితి | ధరావత్తు |
|---|---|---|---|---|
| 1 | ఒక సంవత్సరము పాటు కొబ్బరికాయలు& పూజాసామగ్రీ అమ్ముకొను హక్కు లైసెన్స్ | 500/- | 01-03-2026 నుండి 28-02-2027 వరకు | 2,00,000/- |
| 2 | కొబ్బరిముక్కలు ప్రోగు చేసుకొను హక్కు లైసెన్స్ | 500/- | 01-03-2026 నుండి 28-02-2027 వరకు | 1,00,000/- |

"EO, Sri SeethaRamachandra Swamy Devasthanam, Ellandhakunta"

కార్యనిర్వాహణాధికారి

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానము

అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ఆవరణలో ఫిబ్రవరి 18న ఉదయం 10 గంటలకు టెండర్ బహిరంగ వేలాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల సుధాకర్ ప్రకటన ద్వారా తెలియజేశారు. కొబ్బరికాయలు పూజ సామాగ్రి అమ్ముకునే హక్కు, కొబ్బరి ముక్కలను పోగు చేసుకునే హక్కు లకు సంబంధించిన టెండర్లను దక్కించుకున్న వారు మార్చ్ 1, 2026 నుండి ఫిబ్రవరి 28, 2027 వరకు అనగా ఒక సంవత్సర కాల పరిమితి వరకు నిర్వహించుకోవచ్చని తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు ఏదైనా బ్యాంకు యందు "ఈవో, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, ఇల్లందకుంట" పేరున డిడి తీసి సీల్డ్ టెండర్ కు జతపరచి, ఈ నెల 18న ఉదయం 10 గంటలకు కార్యనిర్వహణాధికారి సమక్షంలో టెండర్ బాక్స్‌లో వేయగలరని కోరుచున్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ప్రస్తుతం వాడుకలో ఉన్న బ్యాంక్ చెక్, 100/- బాండ్ పేపర్, ఆధార్ కార్డ్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. టెండర్లలో పాల్గొనదలచిన భక్తులు నిర్ణీత సమయంలో ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి రావాలని, మరిన్ని వివరాలకు 9849031431 ను సంప్రదించాలన్నారు.

## రైతుకు 'యాప్' కష్టం

**సూర్య, తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు మార్కొండ శ్రీనివాస్‌కు యూరియా బుక్ చేయడం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ వాడటం తెలియక ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం యూరియా పంపిణీకి యాప్‌ను తప్పనిసరి చేయగా, సాంకేతిక పరిజ్ఞానం లేని వృద్ధులు మరియు నిరక్షరాస్యులైన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రీనివాస్ తన ఫోన్ తీసుకుని స్థానిక మల్లాపూర్ పీఏసీఎస్ వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న రైతులు రద్దీగా ఉండటంతో తన యాప్‌లో బుకింగ్ చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు. గంటల తరబడి వేచి చూసినా పని కాకపోవడంతో ఆయన నిరాశతో వెనుదిరిగారు. అధికారుల ద్వారా యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని మరియు పీఏసీఎస్‌ల వద్ద సహాయం చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

## యువతకు క్రీడా సామగ్రి పంపిణీ చేసిన వుల్లెంగుల నవీన్

**సూర్య, తిమ్మాపూర్**

నల్లగొండ గ్రామంలో వుల్లెంగుల సేవా ట్రస్ట్ చైర్మన్ వుల్లెంగుల నవీన్ యువతకు వాలీబాల్ బంతులు, క్రికెట్ బ్యాట్లు,జెర్సీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువతను ప్రోత్సహిస్తూ క్రీడల ద్వారా శారీరక, మానసిక అభివృద్ధి సాధించాలని సూచించారు.యువతకు ఎల్లప్పుడూ తన పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కేవలం క్రీడల రంగంలోనే కాకుండా, ఏ రంగంలో అయినా అభివృద్ధి కోసం అవసరమైతే వ్యక్తిగతంగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధి, యువత ప్రగతికి ఎలాంటి సహాయం కావాలన్నా తనవంతు సహకారం అందిస్తానని వుల్లెంగుల నవీన్ స్పష్టం చేశారు.



## కరీంనగర్ డివైఎఫ్ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

**సూర్య కరీంనగర్ టౌన్**







కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగిన డివైఎఫ్ఐ జిల్లా 6వ మహాసభలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.సురేష్, ప్రధాన కార్యదర్శిగా డి.నరేష్ పటేల్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాజ్‌కుమార్, భాస్కర్ చరణ్,సహాయ కార్యదర్శులుగా అశోక్, శివకుమార్, కోశాధికారిగా అరవింద్‌తో పాటు మొత్తం 19 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ తెలిపారు.నూతన అధ్యక్షుడు, కార్యదర్శులు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యపై జిల్లా వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

**సూర్య, హుజురాబాద్.**



హుజురాబాద్ మునిసిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్, బిజెపి నాయకులు డాక్టర్ వకలాభరణం కృష్ణమోహన్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంతేకాక 12వ వార్డుకు చెందిన ఆర్ దేవేందర్ రెడ్డి కుమారుడు మధుకర్ రెడ్డి అమెరికా నుండి, కుమార్తె మానస సింగపూర్ నుండి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# అనారోగ్యం బాధించిన..బాధ్యత మరువని యశోద.

**- ఆక్సిజన్‌తో వృద్ధురాలి ఓటు**

**సూర్య, హుజురాబాద్.**

ఓటు హక్కును వినియోగించు కోవడానికి బద్ధకిస్తున్న యువకులు ఉన్న ఈ రోజుల్లో.... అనారోగ్యంతో బాధపడుతున్న తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆక్సిజన్ సిలిండర్ తో వచ్చి ఓటు వేసిన 80 ఏళ్ల యశోద ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. వివరాల్లోకెళ్తే.... హుజురాబాద్ పట్టణానికి చెందిన అయిత సత్యనారాయణ సతీమణి అయిత యశోద (80) కరోనాలో అనారోగ్యానికి గురైంది. తర్వాత కొంత కోలుకున్న అప్పటినుండి ఊపిరితిత్తుల బాధతో ఇబ్బంది పడుతూ ఉంది. ఎప్పుడు ఆక్సిజన్ సిలిండర్ ఆమెకు ఉండాల్సిందే. ఇంత అనారోగ్యంతో బాధపడుతున్న రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలనే పౌర బాధ్యత ను మరవకుండా తన కుమారుడైన అయిత హరీష్ భర్త సత్యనారాయణ తో కలిసి ఆక్సిజన్ సిలిండర్ పెట్టుకొని హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 41 పోలింగ్ కేంద్రంలో ఆమె తన ఓటు హక్కును వినియోగించుకుంది. బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకున్న యశోద ను పలువురు ప్రజా స్వామ్య వాదులు ప్రశంసిస్తున్నారు.





యశోదను చూసి నేటి యువతి యువకులు తమ బాధ్య తలను మరిచిపోరాదని గుర్తు చేస్తున్నారు. ఆమె మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచిందని పలువురు అభినందించారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**







**సూర్య జగిత్యాల ప్రతినిధి**

రెండవ మున్సిపల్ సాదారణ ఎన్నికలు జగిత్యాల జిల్లాలో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జగిత్యాల పట్టణంలోని 26 వ వార్డు లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ, 41 వ వార్డులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి, గర్ల్స్ కాలేజీలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, 40 వ వార్డులో తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తదితరులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 7 వ వార్డులో దొంగ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని పోలింగ్ సిబ్బంది, స్థానికులు గుర్తించి ఆవ్ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. 31 వ వార్డులోని పోలింగ్ బూత్ వద్ద నినాదాలు చేసే క్రమంలో ఎంఐఎం, బిఆర్ఎస్ పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు ఇరు వర్గాలకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పట్టణం లోని 26 వ వార్డులో దొంగ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. పలు



పోలింగ్ బూత్ ల వద్ద 100 మీటర్ల లోపలికి చొచ్చుకు వచ్చి ప్రచారం చేస్తున్నారని అభ్యర్థులపై ఆరోపించారు.

# జమ్మికుంట లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**- 80 శాతం పోలింగ్ నమోదు**

**సూర్య జమ్మికుంట**


జమ్మికుంట మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికలలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది పట్టణంలో ఉన్న 30 వార్డులకు గాను జమ్మికుంట టౌన్ తో పాటు ధర్మారం రామన్నపల్లి కొత్తపల్లి మోత్కులగూడెం ఆబాది జమ్మికుంట కేశవాపూర్ గ్రామాల పరిధిలో ఉన్న వార్డులలో అధికారులు పోలింగ్ బూతులు ఏర్పాటు చేసారు వార్డుకు రెండు చొప్పున బూతులు ఏర్పాటు చేయగా ఉదయం నుండి ఓటర్లు ఓటింగ్ కోసం బార్లు తీరారు మందకోడిగా ప్రారంభమైన ఓటింగ్ ఉదయం 9 గంటల వరకు గంటల వరకు 8 శాతం 11 గంటల వరకు 24 శాతం ఒంటిగంట వరకు 47% మూడు గంటల వరకు 66% శాతం నమోదు కాగా పోలింగ్ పూర్తిగా అయ్యేసరికి 79.81 శాతానికి చేరుకుంది ఉదయం నుండి ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్కు తరలివచ్చారు వృద్ధులు వికలాంగులు కూడా పెద్ద సంఖ్యలో ఓటింగ్ లో పాల్గొనడం గమనార్హం గ్రామీణ ప్రాంతాలలో నాలుగు గంటల వరకే ఓటింగ్ దాదాపు పూర్తిగా గాగా పట్టణంలో మాత్రం ఐదు గంటల తరువాత కూడా పోలింగ్ జరిగింది హుజురాబాద్ ఏసిపి మాధవి అద్వర్యం లో జమ్మికుంట సిఐ రామకృష్ణ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలోనే వాహనాలన్నిటిని నిలిపివేశారు జమ్మికుంట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించారు ప్రాథమిక వైద్యంతోపాటు తాగునీరు టాయిలెట్లు అందుబాటులో ఉంచారు యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్ లో పాల్గొనడం గమనార్హం.





# సోషల్ మీడియాలో వైరల్ గా మారిన బ్యాలెట్ పేపర్

**సూర్య, హుజురాబాద్**




ఓటును రహస్యంగా ఉంచాల్సిన ఓటరు... తన బాధ్యత తను ఎవరికి ఓటు వేశాను అనేది సెల్ఫోన్లో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేసిన సంఘటన హుజురాబాద్ లో జరిగింది. బుధవారం హుజురాబాద్ పట్టణంలోని కాకతీయ స్కూల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో రెండో వార్డుకు చెందిన పల్లపు సాయి ఓటు హక్కు వినియోగించుకున్నాడు. కాగా తాను రెండో వార్డులో బిజెపి తరపున పోటీ చేసిన దున్నపోతుల ఎల్లమ్మకు ఓటు వేశాడు. ఇది తన సెల్ ఫోన్ లో ఫోటో తీసి తన స్నేహితుడైన అశోక్ తెలిపాడు. ఇంతటితో ఆగకుండా బిజెపికి ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ ను సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో సంచలనంగా మారింది. సహజంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఓటర్లను సెల్ఫోన్ తీసుకొని వెళ్లడానికి అనుమతించారు. పోలింగ్ బూత్ లో కూడా ఉన్న అధికారులు సెల్ ఫోను తీసుకొని రావడానికి అడ్డగిస్తారు. ఇంతమంది కళ్ళు కప్పి ఒక వ్యక్తి తాను ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ ఫోటో తీసుకోవడం దాన్ని వైరల్ చేయడం పట్ల పలువురు అధికారులు ఏం చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. ఓటరు తన తో సెల్ఫోన్ తీసుకొని వెళుంటే అక్కడున్న పోలీసులు గాని పోలింగ్ సిబ్బంది కానీ చూస్తూ ఎలా ఊరుకున్నారు అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. బ్యాలెట్ పేపర్ వైరల్ కావడానికి పోలీసులు సైతం ఏం జరిగింది ఎవరు చేశారు అన్నదానిపై ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా రహస్యంగా ఉండాల్సిన ఓటును బహిరంగపరచడం సరికాదని బాధ్యత మరిచిన అధికారులపై చర్యలు ఏం తీసుకుంటారు అని ప్రజలు అనుకుంటున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

**- మెజారిటీ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందిలి**

**- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**- చొప్పదండిలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే**

**సూర్య చొప్పదండి**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ,కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బుధవారం చొప్పదండి పట్టణంలోని 10వ వార్డులో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా చొప్పదండి మున్సిపాలిటీని అధిక మెజారిటీతో కైవసం చేసుకోబోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని జోష్యం చెప్పారు. చొప్పదండి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు ఆ పార్టీలను నమ్మే పరిస్థితి లేదని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్న నమ్మకంతో ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని పేర్కొన్నారు.

## జిల్లాలో పోలింగ్ శాతం 70.13 నమోదు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లాలో బుధవారం జరిగిన రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ శాతం 70.13 గా నమోదైనట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.జగిత్యాల మున్సిపాలిటీలో 94800 మంది ఓటర్లకు 65985 మంది ఓట్లు వేయగా పోలింగ్ శాతం 69.60 గా నమోదయ్యింది. కోరుట్ల మున్సిపాలిటీలో 63507 మంది ఓటర్లకు 44116 మంది ఓట్లు వేయగా పోలింగ్ శాతం 69.47 గా నమోదయ్యింది. మెట్పల్లి మున్సిపాలిటీలో 46201 ఓటర్లకు 31975 మంది ఓట్లు వేయగా పోలింగ్ శాతం 69.21 గా నమోదు అయ్యింది. ధర్మపురి మున్సిపాలిటీలో 14035 ఓటర్లకు 10549 మంది ఓట్లు వేయగా పోలింగ్ శాతం 75.16 నమోదయింది. రాయికల్ మున్సిపాలిటీలో 13084 ఓటర్లకు 9808 మంది ఓట్లు వేయగా పోలింగ్ శాతం 74.96 గా నమోదు అయ్యింది. మొత్తం ఓటర్లు 231627 కు 162433 మంది ఓటు హక్కు వినియోగించుకోగా పోలింగ్ శాతం 70.13 గా నమోదు అయ్యింది.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

**సూర్య జగిత్యాల అర్బన్**

జిల్లాలో 5 మున్సిపాలిటీలలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్గాడే కాళీచరణ్ సుదామారావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది హాజరు, మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ



ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, త్వరితగతిన పూర్తి అయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆర్.ఓ అధికారులకు ఆదేశించారు. అంతకుముందు మెట్ పెల్లి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాన్ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న సరళి ఓటర్లకు కల్పించిన సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే పోలింగ్ సిబ్బంది ఓటర్లకు ఓటు హక్కు వినియోగించే తీరును పరిశీలించారు. ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిధిలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు.

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.**

**సూర్య జగిత్యాల**



జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎస్పీ వివిధ ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఓటరు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కున్నారన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారుల కు , సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, ఇన్స్పెక్టర్ లు కరుణాకర్, రవి, ఎస్. ఐ లు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మున్సిపల్ ప్రజా ప్రతినిధుల గౌరవ వేతనాలు ఇవే

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం చెల్లించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపాలిటీల్లోని చైర్ పర్సన్లు, వైస్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లకు ఇస్తారు. ప్రభుత్వం 2021నవంబర్లో మున్సిపాలిటీల్లో గెలుపొందిన వారికి చెల్లించనున్న గౌరవ వేతనాలను ఖరారు చేస్తూ జీవో 199ను జారీ చేసిందని, ఆ ఉత్తర్వుల వివరాలను తెలంగాణ రెవిన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జగిత్యాల మాజీ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఇలా వివరించారు. హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ తో పాటు ఇతర నగర పాలక సంస్థలను, మున్సిపాలిటీలను కేట గేరీలుగా విభజించారు. హైదరాబాద్ మహా నగర పాలక సంస్థతో పాటు ఇతర నగర పాలక సంస్థలను కేటగిరి -1 లో చేర్చారు. 50వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న మున్సిపాలిటీలను కేటగిరి-2 లో, 50 వేల లోపు జనాభా కల్గిన మున్సిపాలిటీలను కేటగిరి -3గా విభజించి గౌరవ వేతనాలు చెల్లిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ల కు రూ. 65వేలు, డిప్యూటీ మేయర్ కు రూ. 32.500, కార్పొరేటర్ కు రూ. 7,800 ల వంతున చెల్లిస్తున్నారు. కేటగిరి -2కు చెందిన మున్సిపాలిటీ చైర్ పర్సన్ కు రూ. 19,500, వైస్ చైర్ పర్సన్ కు రూ. 9,750,కౌన్సిలర్ కు రూ. 4,550,కేటగిరి -3 కు చెందిన మున్సిపాలిటీ చైర్ పర్సన్ కు రూ. 15,600,వైస్ చైర్ పర్సన్ కు రూ. 6,500,కౌన్సిలర్ కు రూ. 3,250 వంతున గౌరవ వేతనం చెల్లిస్తున్నారు.

## ఆర్జీ-3 రిటైర్డ్ జీఎం దంపతులను సన్మానించిన సర్పంచ్

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఆర్జీ-3 డివిజన్ రిటైర్డ్ జీఎం నరేంద్ర సుధాకరరావు-అలివేణి దంపతులను బుధవారం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఆయన ఇటీవల పదవీ విరమణ పొందారు. ఆర్జీ-3 డివిజన్ కు, ప్రభావిత గ్రామాలకు ఆయన అనేక సేవలు చేసి అందరి మన్ననలు పొందారని వారు అన్నారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఫోటో ఫ్రేమ్ అందచేశారు. కాగా సర్పంచ్ గా నూతనంగా గెలిచినందుకు రిటైర్డ్ జీఎం దంపతులు నరేంద్ర సుధాకరరావు-అలివేణి లు సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు లను ఘనంగా సన్మానించి అభినందించారు.

## నేటి సార్వత్రిక సమ్మెకు...బిఎంఎస్ దూరం

**- అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య**

**సూర్య, సెంటినరీ కాల**



దేశవ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన గురువారం జాతీయ సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్( బిఎంఎస్) పాల్గొనడం లేదని అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2 ప్రాజెక్ట్ లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో బూజు పట్టిన చట్టాలను ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య దేశంలో సుమారు 40 కోట్ల సంఘటిత అసంఘటిత క్షేత్రంలో పనిచేస్తున్న కార్మికులకు వర్తించే విధంగా చారిత్రాత్మకమైన చట్టాలను తీసుకు వస్తే, కొన్ని రాజకీయ పార్టీలు, అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు రాజకీయ ప్రేరేపిత విచ్ఛిన్నకర సమ్మె చేయడం సరికాదన్నారు. దేశ అభివృద్ధి, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలు అనుబంధ సంఘాల నాయకులు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని, గతంలో చట్టాలు దేశంలో 7 కోట్ల సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకే వర్తించేవని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడుల గురించి వివరించారు. ఏరియా కార్యదర్శి రౌతు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పొన్నమనేని వేణుగోపాలరావు, జాయింట్ సెక్రటరీ గోగుల విద్యాసాగర్, పిట్ సెక్రటరీ మద్రి సంతోష్, కుమ్మరి నగేష్, ఎండి.జానీమియా, సురేందర్, సల్ల వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సవాళ్ల సింగరేణి కి..."డాక్టర్ సాబ్" చికిత్స చేసేనా...!

**- కొత్త సిఅండ్ఎండి గా డా.జ్యోతి బుద్ధ ప్రకాష్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థకు నూతన సిఅండ్ఎండి గా డా.జ్యోతి బుద్ధ ప్రకాష్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ క్యాడర్ కు చెందిన 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కర్ణాటకకు చెందిన ఈయన ఎం.బి.బి.ఎస్ విద్యను అభ్యసించారు. ఈయన తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా సహ పలు కీలక పరిపాలన పదవులను నిర్వహించారు. గత డిసెంబర్ లో సిఅండ్ఎండి గా ఉన్న బలరాం నాయక్ తన రెవెన్యూ శాఖకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఇంచార్జి గా ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్ కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా సింగరేణి లో ఓబీ కాంట్రాక్టుల్లో సైట్ విజిట్ నిబంధన సంస్థ ను అతలాకుతలం చేసింది. ఇది ప్రక్క రాష్ట్రమైన ఒరిస్సా లోని నైనీ ప్రాజెక్ట్ ను కూడా తాకింది. ఇక సింగరేణి సంస్థ లో బొగ్గు నాణ్యత తగ్గిందని, కొనే గిరాకీ తగ్గడం జరిగింది. దీనికి తోడు మెడికల్ బోర్డు సజావుగా సాగకపోవడం ఒక సవాల్ గా ఉంది. ఇప్పటికే పర్మినెంట్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, వారిని పని స్థలాల్లో సర్దుబాటు చేయడానికి యాజమాన్యం నానా తంటాలు పడుతుంది. ఇక అధికారులకు పెర్ఫార్మన్స్ రిలేటెడ్ పే(పి.ఆర్.పి) ఒక సమస్యగా మారింది. వీటన్నింటికి నూతనంగా వస్తున్న "డాక్టర్ సాబ్ " చికిత్స చేసేనా అని చర్చ మొదలైంది.

## మహాశివరాత్రి కి ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు.

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు మండలంలోని రాములపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రసిద్ధ నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీ సిద్ధి తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో దేవాలయం నుండి గ్రామంలోని ప్రధాన చౌరస్తా వరకు ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో ఎలాంటి వెలుగుల ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. దేవాలయ పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు విద్యుత్ వెలుగులతో ప్రకాశవంతంగా మారడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ చర్యపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్పంచ్ వివాహా దినోత్సవ వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు వివాహ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి రత్నాపూర్-రాంనగర్ తదితర ప్రాంతాల్లో గ్రామ పెద్దలు, యువకులు కేక్ లు కట్ చేసి టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాద్రవు ప్రవళిక-ప్రశాంత్, బీజేపీ అధ్యక్షుడు కొండు లక్ష్మణ్, వార్డు సభ్యులు కెక్కర్ల ఉష అశోక్, జక్కుల పద్మ చందన్, పబ్బ ప్రవంతివెంకటేష్, ఒర్రె సురేష్, సందవేన కుమార్, మేకల రామచందర్, పబ్బ మొగిలి, ఇజ్జగిరి సంపత్, ఇజ్జగిరి రాజు, పీట్ల రవి, కొదురుపాక భీమయ్య, కొదురుపాక సాయి, పున్నం సమ్మయ్య, బాద్రవు కృష్ణమూర్తి, పానుగంటి వీరేశం, పానుగంటి ప్రశాంత్, మండల శంకర్, జక్కుల శ్రీనివాస్, కత్తి మహేష్, బాద్రవు కృష్ణకర్,కేశవేన మల్లేష్, ముక్కెర మోహన్, దాసరి గణేష్, ఓడనాల రఘుపతి, మేడగొండ మధుకర్, చిదురాల శివ, సింగరవేన రవి, రౌతు శివ పటేల్, సింగ్ పాల్గొన్నారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో.. మొక్క నాటిన బుర్ర రాజశేఖర్ రవళి ..

**సూర్య, బోయినపల్లి.**



మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా బోయినపల్లి మండలం తడగొండ లో బుర్ర రాజశేఖర్ రవళి ల కుమారుడి నామకరణం చేసిన తదనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామకరణం చేసి మా కుటుంబ సభ్యులతో జమ మొక్క నాటడం చాలా సంతోషంగా ఉందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేష్ రాజు శేఖర్ , గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 57వ డివిజన్ ఇండిపెండెంట్ అభ్యర్థి పై దాడి!

**సూర్య-గోదావరిఖని**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 57 వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి గుండు రాజు పై బుధవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎల్లయ్య అనుచరుడు దాడి చేసినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే గోదావరిఖని పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాతపల్లి ఎల్లయ్య కు సంబంధించిన ఆర్.పి ఒకరు 45 ఓట్లకు సంబంధించిన వివరాలను తన వద్ద పెట్టుకుంది. అయితే ఆ 45 మంది ఓటర్లు స్థానికంగా లేకపోవడంతో బయట నుంచి కొంత మంది హమాలీలను పిలిపించి వారితో ఓటు వేయించేందుకు సిద్ధపడుతున్న సమయంలో ఒక మహిళ ఈ వ్యవహారాన్ని గమనించి స్వతంత్ర అభ్యర్థి గుండు రాజుకు చెప్పింది. ఇంతలో ఎల్లయ్య అనుచరులకు గుండు రాజుకు మధ్య గొడవ జరగడం, అది కాస్త గుండు రాజు పై దాడి చేసే వరకు వచ్చింది. వెంటనే స్థానికంగా ఉన్న పోలీసులు స్పందించి అందరిని చెదరగొట్టారు. ఓటమి భయంతో ఎల్లయ్య, అతని అనుచరులు దొంగ ఓటు వేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపణలు 57 వ డివిజన్ లో గుప్పుమంటున్నాయి.

## తాత నీకు తోడుగా నేనున్న...

**- పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు వృద్ధునికి ఎమ్మెల్యే చేయుత**

**సూర్య మెట్‌పల్లి**

తాత నీకు తోడుగా నేనున్న పద అని చేయి పట్టి నడుస్తూ ఓ వృద్ధు నికి ఎమ్మెల్యే తోడుగా నిలిచాడు. పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఈ సంఘటన అక్కడ ఉన్న అందరినీ ఆకట్టుకుంది. వివరాల్లోకి వెళితే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దంపతులు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాగా అక్కడ వృద్ధ దంపతులు ఓటు వేసేందుకు వేచి ఉన్నారు. వృద్ధుడికి నడిచేందుకు ఇబ్బంది ఏర్పడడంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే సంజయ్ వృద్ధుడి చేతు పట్టుకొని పోలింగ్ కేంద్రం వరకు తీసు కువెళ్లి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ దృశ్యం అక్కడ ఉన్న అందరిని ఆకట్టుకుంది.

## వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిశీలన

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

పోలింగ్ జరుగుతున్న తీరును ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామారావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. బుధవారం జిల్లాలోని 5 మున్సిపాలిటీ లలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా జరుగుతున్న పోలింగ్ సరళిని పరి శీలించారు. వివిధ మున్సిపాలిటీలలోని పోలింగ్ కేంద్రల్లో పోలింగ్ కేంద్రం లోపల ఓటింగ్ సరళి, పోలింగ్ కేంద్ర బయట ఓటర్ల రద్దీ వంటి అంశా లను ప్రత్యక్షంగా పరిశీలించారు.అలాగే పోలింగ్ జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. రిపోర్ట్‌లను సూచించిన సమయం ప్రకారం ప్రతి రెండు గంటలకు ఒకసారి తెలియ జేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా నోడల్ అధికారులు కె.రాజ్ కుమార్, పి.నరేష్, కలెక్టరేట్ ఏవో హకీమ్, ఈ డి ఎం మమత, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్‌కు కొడిమ్యాల విద్యార్థుల ఎంపిక

**- ఎస్‌జీఎఫ్ అండర్-17కు శ్రీహర్ష ఎంపిక కాలేజీకి గర్వకారణం**
**- ప్రిన్సిపాల్ కే. వేణు**

**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్-17 క్రికెట్ జట్టుకు కాలేజీ విద్యార్థి కోలా శ్రీహర్ష ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కే వేణు తెలిపారు.మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 13న నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ మ్యాచ్‌లకు శ్రీహర్ష ఎంపిక కావడం కాలేజీకి గర్వకారణమని తెలిపారు. క్రీడా రంగం లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయికి ఎదగడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, కాలేజీకి చెందిన మరో విద్యార్థి ఎర్రోజి తక్షిల్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-19 టోర్నమెంట్‌లో ప్రస్తుతం పాల్గొంటున్నాడు. ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి లో రాణించడం కళాశాలకు మరింత ప్రతిష్ట తీసుకువచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ ఇన్‌చార్జి బి. భాస్కర్, క్లాస్ టీచర్ జయపాల్ రెడ్డి, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ తోడ్పాటు

**- 45 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేత**

**సూర్య కరీంనగర్**

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ఎంతో ఉపయోగకరమని హైదరాబాద్ బైరాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నా రు. హన్మకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో బైరాడ్ సహ కారంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 37 రోజులపాటు 45 మంది మహిళలకు శిక్షణ అందించారు. శిక్షణ ముగింపు సందర్భంగా జనవికాస సీఈవో పెండ్లి సంపత్ కుమార్‌తో కలిసి సర్టిఫికెట్లు అందజే శారు. ఈ ధృవపత్రాల ఆధారంగా ముద్ర, పీఎంఈజీపీ లోన్లు పొందే అవకాశం ఉందన్నారు. మహిళలు టైలరింగ్ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్ నిర్మలతో పాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో మానవత్వం చాటుకున్న పోలీసులు

**సూర్య కరీంనగర్**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా, ఆరేపల్లి ఒకటవ డివిజన్‌లోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు తమ ఉదారతను చాటుకు న్నారు.ఓటు వేయడానికి వచ్చిన ఒక విక లాంగుడైన వృద్ధుడు నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, వెంటనే స్పందించి వీల్ చైర్ ఏర్పాటు చేశారు. స్వయంగా ఆ వృద్ధుడిని వీల్ చైర్ సహాయంతో పోలింగ్ స్టేషన్ లోనికి పంపించి, ఆయన తన ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఓటరుకు సులభంగా ఓటు వేసే అవకాశం కల్పించడం తమ బాధ్యతని తెలిపారు.

## నేను దేశవ్యాప్త సమ్మెకు దూరం

**సూర్య, సెంటినరీ కాలనీ**



నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె కు నేను దూరంగా ఉంటున్నానని ఆర్జీ-3 జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ రాపోలు నగేష్ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తమ గ్రేడుని మార్చాలని అన్ని ట్రేడ్ యూనియన్ల ఆఫీసుల చుట్టూ తిరిగిన ఏ కార్మిక నాయకుడు తమ గురించి పట్టించుకోలేదని, అల్ప సంఖ్య ఉద్యోగులమైన తమ పట్ల వివక్ష చూపిస్తూ, అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన ఇతర ట్రేడ్స్ మెన్, ఆపరేటర్స్, డ్రైవర్లు, సర్దార్లు, ఓవర్సీర్స్‌ల గ్రేడ్‌లు పెంచారు కానీ తమను విస్మరించారని తెలిపారు. సివిల్ డిపార్ట్మెంట్ లోని సబ్ ఓవర్సీర్స్ వలె తమ టి అండ్ ఎస్ గ్రేడ్-ఈను గ్రేడ్-సి గా మార్చుట కు ప్రయత్నిస్తున్నామని, స్ట్రక్చర్ మీటింగ్‌లో గుర్తింపు సంఘాలు తమ గోడును పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సమస్యలు తీరనందుకే ఆయన సమ్మెకు దూరంగా ఉన్నట్లు తెలిపారు.

## హరిత సేనలో మొక్క నాటిన చిన్నారి సమీక్ష

**సూర్య బోయినపల్లి**

మాజీ రాజ్యసభ సభ్యు లు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో బోయి నపల్లి మండలం తడ గొండలో సవనపెల్లి మహేష్ మనీషా చిన్న కుమార్తె సమీక్ష, జన్మదినం పురస్కరించుకొని కుటుం బ సభ్యులతో కలిసి వారి ఇంటి ఆవరణలో మొక్క నాటిన సమీక్ష. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాకు మొక్కలు నాటడం చాలా ఇష్టమని నా పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటడం సంతోషంగా ఉందని తెలి పారు. మాజీ సర్పంచ్ చిందం రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లో భాగంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాహ్నవి,లత, అర్చన, చిన్నారులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు ప్రారంభం

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలం లోని ధర్మారం టు అగ్ర హారం రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై నుండి నిధు లు మంజూరు కాగా బుధ వారం నాగారం రామన్న పేట సర్పంచులు రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా ధర్మారం నుండి నాగారం, రామన్న పేట, చంద్రగిరిగ్రామాల నుండి అగ్రహారం వరకు గతంలో నిధులు మంజూరు కాగా నిధులు సరిపోక రామన్నపేట వరకు మాత్రమే తారు రోడ్డు వేశారు.మిగిలిపోయిన రోడ్డు నిర్మాణానికి మళ్లీ రూ.2.66 కోట్లు మంజూరు కాగా కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని నాగారం సర్పంచ్ అప్పల నాగభూషణం కోరారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ కంది లక్ష్మి, నాగారం ఉపసర్పంచ్ కీర్తన, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని చితకబాదిన అంగన్వాడీ టీచర్

**సూర్య, ఎల్లారెడ్డిపేట**

అభం శుభం తెలియని ఓ చిన్నారిని అంగ న్వాడీ టీచర్ దారుణంగా కొట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామం లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంక టాపూర్‌కు చెందిన కొమ్మేపల్లి లక్ష్మి విజయ్ కుమార్ దంపతుల కుమారుడు కొంపెల్లి విధ్వాన్ష్(3)ను స్థానిక అంగన్వాడీ కేంద్రానికి పంపిస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం తన కొడుకుని అంగన్వాడీ కేంద్రానికి పంపా రు. అయితే టీచర్ సల్వాని రాణి అకారణంగా బాలుడిని కొట్టడంతో కంటి కి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి అని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేపట్టినట్లు ఎస్ఐ కె. రాహుల్ రెడ్డి తెలిపారు.

## హార్వెస్టర్ టైర్ల చోరీ

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలం శివంగలపల్లి గ్రామంలో గుర్తు తెలి యని దుండ గులు హార్వె స్టర్ టైర్లను దొంగలించారు.గ్రామానికి చెందిన పుట్ట రోహిత్ అనే రైతు తన హార్వెస్టర్ గ్రామంలోని రోడ్డు పక్కన ఉంచాడు.మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు రెండు టైర్లను ఎత్తుకెళ్లారు.దీనిపై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు బాధిత రైతు వాపోయాడు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

**సూర్య, హుజురాబాద్.**

హుజురాబాద్ మునిసిపాలిటీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో బీసీ కమి షన్ మాజీ చైర్మన్, బిజెపి నాయకులు డాక్టర్ వకలా భరణం కృష్ణమోహన్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, బిజెపి జిల్లా అధ్య క్షుడు గంగాడి కృష్ణారెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## రేపు "గుండి"లో "ఉచిత కంటి పరీక్ష శిబిరం"..

**- "గ్రామపంచాయతీ" పాలకవర్గం ఆధ్వర్యంలో..**

**సూర్య రామడుగు**

రామడుగు మండలం గుండి గ్రామంలో శుక్రవారం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో డాక్టర్అగర్వాల్స్ కంటి హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నామని గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం ఉప సర్పంచ్ ఫిరోజ్ తెలిపారు. ఈ ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని గ్రామ ప్రజలు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు..

## రామగుండంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన వేణుగోపాల్ రెడ్డి

**సూర్య-గోదావరిఖని**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో బుధవారం జరిగిన పురపాలక ఎన్నికల ను ఎన్నికల పర్యవేక్షణ అధికారి, పురపాలక పరిపాలనా శాఖ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పరిశీలించి పోలింగ్ తీరును పర్యవే క్షించారు.ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామ గుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను ఆయనకు వివరించారు. ఎలక్షన్ మెటీరియల్, రిసెప్షన్ కౌంటర్ తో పాటు ఎన్టీపిసి టౌన్ షిప్ లోని సెయింట్ క్లెయిర్ పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం, గోదావరి ఖని పట్టణంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు.

## కోటి తలంబ్రాలు' గోటితో'...

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండల కేంద్రం లోని శివాల యంలో కోటి తలంబ్రాలు గోటితో బుధవా రం మహిళలు ప్రారంభించారు. భద్రాచలంలో శ్రీరామనవమి తలంబ్రాల్లో భాగంగా శ్రీ భక్త రామదాసు భక్త మండలి భూపాలపల్లి జిల్లా చల్పూర్ గ్రామం నుండి కమాన్ పూర్ కు వరి ధాన్యాన్ని చిన్న పాకెట్లలో తీసుకువచ్చారు. దీంతో మండల కేంద్రంలోని శివాలయం లో ఆయా వడ్ల గింజలను గోటితో తీస్తూ కోటి తలంబ్రాలుగా మార్చేందుకు రామ నామాన్ని జపిస్తూ మహిళలు వడ్ల ను గోటితో బియ్యాన్ని తీశారు. ఆయా బియ్యాన్ని భద్రాచలంలోని శ్రీ రామచంద్ర స్వామి ఆలయంలో తలంబ్రాలుగా వాడతారు. దీంతో కోటి తలంబ్రాలు గోటితో కార్యక్రమంలో కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన మల్లీశ్వరి, లావణ్య, మట్ట శారద, విజయ, కోలేటి కవిత, సునీత, జ్యోతి, రమ పాల్గొన్నారు.

## సమ్మెకు దూరంగా జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్‌లు

**సూర్య, సెంటినరీ కాలనీ**




సింగరేణి సంస్థలో తమపై యూనియన్లు అవలంబి స్తున్న తీరుకు నిరసనగా అన్ని ఏరియాల్లో జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్లు సమ్మెకు దూరంగా ఉన్నట్లు తెలిపారు. చాలా సంవత్సరాలుగా జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్లు తమ గ్రేడ్ ను పెంచాలని ఎన్నో దరఖాస్తులు ఇచ్చిన కూడా ఎటువంటి ఫలితం లేదని, యూనియన్లు కూడా తమను పట్టించుకోలేదని తెలిపారు. పలుమార్లు యూనియన్ ఆఫీసుల చుట్టూ తిరిగిన కూడా ఏ-యూనియన్ నాయకుడు తమ గోడు వినిపించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అన్ని సంఘాలు ఇచ్చిన సమ్మెకు దూరంగా ఉంటున్నామని జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్‌లు ప్రకటించారు.